రైతులకు పెట్టుబడి సాయం డబ్బులు వెంటనే చెల్లించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

నవ తెలంగాణ - కొమురవేల్లి



పెట్టుబడి సహాయం కింద డబ్బులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి కోరారు. మండల కమిటీ సమావేశం రాంసాగర్ సర్పంచ్ తడూరి రవీందర్ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలవగానే డిసెంబర్ 9 తేదీన రైతుల ఖాతాల్లో పెట్టుబడి సహాయం జమ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దాసరి ప్రశాంత్, అత్తిని శారదా, మండల నాయకులు తేలు ఇస్తారి, తాడూరి మల్లేశం, శ్రవణచారి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

1

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శుక్రవారం | 22 డిసెంబర్ 2023 | www.navatelangana.com

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన చాడ వెంకటరెడ్డి

నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్



హుస్నాబాద్ పట్టణానికి చెందిన సీనియర్ పురోహితులు రామక చంద్రమౌళి శర్మ ఇటీవల మృతి చెందారు. గురువారం సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ఆ పార్టీ నాయకులతో కలిసి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేశ్, గోవింద్ రవి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అయిలేని సంజీవరెడ్డి, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జనగాం రాజు కుమార్, సిపిఐ మండల నాయకులు అయిలేని మల్లారెడ్డి, ఎండి అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

పగలే వెలుగులు

నవతెలంగాణ- కొల్చారం



విద్యుత్ అధికారులు పర్యవేక్షణ లోపం కారణంగా పట్టపగలే వీధి దీపాలు వెలుగుతూ వారి నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతు న్నాయి. దీంతో విలువైన విద్యుత్ వృథా అవుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని పోతంశెట్టిపల్లి చౌరస్తాను మొదలుకుని గ్రామంలో వీధి దీపాలు పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. కొత్త కాలనీలోని సింగిల్ ఫేస్ ట్రాన్స్ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు తీగలుగా చుట్టుముట్టాయి. దీంతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపాల నిర్వహణను విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా వెలుగు తుండడంతో వందలాది యూనిట్ల విద్యుత్ వృథా అవుతోందని, ఫలితంగా విద్యుత్ శాఖ, గ్రామ పంచాయతీలు తీవ్రంగా నష్టపోతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రత్యేక లైన్లు ఆన్‌ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేస్తేనే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని కొందరు భావిస్తున్నారు. ప్రభుత్వం నిరంతరం రూ.వేల కోట్లు వెచ్చిస్తున్న విద్యుత్‌ను ఆదా చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రాత్రి పూట ఆన్ చేసి ఉదయం ఆఫ్ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆన్‌ఆఫ్ సిస్టమ్ లేకపోవడంతో గ్రామ పంచాయతీకి వేల రూపాయల బిల్లులు వస్తున్నాయి. అధికారులు స్పందించి గ్రామాలలో వీధిలైట్లకు ప్రత్యేక లైన్‌తో పాటు ఆన్‌ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గీతంలో ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ పటాన్‌చెరు





గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయంలోని శివాజీ ఆడిటోరియంలో గురువారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రావ్యమైన పాటలు ఆహూతులను ఉల్లాసరిచాయి. క్రిస్మస్ స్ఫూర్తిని తెలిపే కథనం, చిత్రీకరణ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. పలువురు అదృష్టవంతులు శాంతాక్లాజ్ నుంచి బహుమతులు అందుకున్నారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

ముగిసిన వర్క్‌షాప్

గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో ఆధ్వర్యంలో బయోమెడికల్ పరిశోధనలో ఉపయోగించే చిన్న జంతువుల నిర్వహణ ప్రాథమిక పద్ధతులపై అవగాహన కల్పించడం కోసం నిర్వహిస్తున్న రెండు రోజుల కార్యశాల గురువారం విజయవంతంగా ముగిసింది. ఈ వర్క్‌షాప్‌లో దేశం నలుమూలల నుంచి సుమారు 450 మంది ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు. సిద్ధార్థ ఇన్స్టిట్యూట్, పుల్లారెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ, జి.పుల్లారెడ్డి కళాశాల, షాదన్ కాలేజీ, భారత్ విద్యా సంస్థలు, ప్రతాప్రెడ్డి కళాశాల, గీతం విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని, జంతు నిర్వహణ సూక్ష్మ నైపుణ్యాలపై శిక్షణ పొందారు. ఇది విజయవంతం కావడానికి సహకరించిన విద్యార్థులు, ఆయా విద్యా సంస్థలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

జాతర ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



నవతెలంగాణ పటాన్చెరు

గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు మండలం గణపతి గూడెం గ్రామంలో ఈ నెల 25, 26వ తేదీలలో నిర్వహించనున్న రేణుకా ఎల్లమ్మ జాతర మహోత్సవాల ఆహ్వాన పత్రికను గురువారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జగన్, ఎంపీటీసీ మమతా బిక్షపతి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డైనింగ్ హాల్ నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ పటాన్చెరు



ఎంపీయూపీఎస్ చిన్న కంజర్ల పాఠశాలలో మేడ్వాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పార్కర్ హనిఫిన్ ఇండియా సహకారంతో డైనింగ్ హాల్ నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. మేడ్వాన్ డైరెక్టర్ హెచ్ మధుసూదన్ రెడ్డి, సిడబ్ల్యూసీ వెంకటేష్, ఎస్ఎంసీ చైర్మెన్ శ్రీనివాస్, వైఎస్ చైర్మెన్ జహంగీర్ ఖాన్, సర్పంచ్ నారాయణ రెడ్డి, ఉప సర్పంచ్ రామ్ చెంద్రారెడ్డి, కార్యదర్శి రామకృష్ణన్, సభ్యులు నాగభూషణం, రాములు, అబుదుల్ హాఫీస్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

చెట్టుకు ఉరేసుకుని ఇద్దరి ఆత్మహత్య

వీరన్నపేటలో ఒకరు,

మక్కరాజుపేటలో మరొకరి ఆత్మహత్య

నవతెలంగాణ-చేర్యాల,చేగుంట



చెట్టుకు ఉరేసుకుని ఇద్దరు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వీరన్నపేట, మెదక్ జిల్లా చేగుంట మండలం మక్కరాజుపేటలో గురువారం చోటు చేసుకున్నాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వీరన్నపేటకు చెందిన బింగి చంద్రం(35) కొంత కాలంగా ఆర్థిక ంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఏం చేయాలో తోచని పరిస్థితుల్లో చంద్రం గురువారం వీరన్నపేట శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

చెట్టు కొమ్మకు ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మెదక్ జిల్లా చేగుంట మండలం మకరాజుపేట గ్రామానికి చెందిన కాశ బోయిన సతీష్(29) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 20న రాత్రి 9 గంటలకు కాలకృత్యాలు తీర్చుకోవడానికి బయటకు వెళ్లిన సతీష్ తిరిగి రాలేదు. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. గ్రామ శివారులోని లింగంకుంట దర్గా వద్ద మర్రిచెట్టుకు సతీష్ నైలాన్‌తో ఉరేసుకున్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడకు చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య లక్ష్మి, నాలుగు సంవత్సరాల కూతురు మనుశ్రీ ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు ఎస్సై హరీష్‌గౌడ్ దర్యాప్తు చేస్తున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఎంపీ ఎన్నికలపై నజర్

- మెదక్, జహీరాబాద్ స్థానాల్ని దక్కించుకునే వ్యూహం
- రెండు స్థానాల్లో పాగా వేయాలని కాంగ్రెస్ కసరత్తు
- సిట్టింగ్ స్థానాల కోసం బీఆర్ఎస్ ప్లాన్
- ఉనికి చాటుకోవాలని కమలం తహతహ
- రెండు పార్లమెంట్ స్థానాల పరిధిలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు
- 8 చోట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు..5 చోట్ల కాంగ్రెస్... ఒక చోట బీజేపీ
- గెలుపు గుర్రాల అన్వేషణలో ప్రధాన పార్టీలు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

అందరి దృష్టి పార్లమెంట్ ఎన్నికలపై పడింది. మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని 14 అసెంబ్లీ స్థానాల్లో నువ్వానేనా అన్నట్లుగా పోటీ జరగడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు మిశ్రమ ఫలితాలొచ్చాయి. ఎనిమిది చోట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలుపొందగా ఐదు చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలిచారు. కామారెడ్డిలో మాత్రమే బీజేపీ ఎమ్మెల్యే గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో ఆ పార్టీకి కాస్త కలిసొచ్చే అవకాశాలుంటాయి. తక్కువ మందే ఎమ్మెల్యేలు గెలిచినా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రభావం ఆ పార్టీ గెలుపుకు దోహదపడే ఛాన్స్ లేకపోలేదంటున్నారు. రెండు ఎంపీ స్థానాల పరిధిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పట్టు సాధించిందిన బీఆర్ఎస్‌కు ఎమ్మెల్యేల సంఖ్య అధికంగా ఉన్నందున ఆ పార్టీకి కూడా గెలుపు అవకాశాలెక్కువే అనే ధీమా వారిలో వ్యక్తమవుతోంది. బీజేపీ సైతం కామారెడ్డిలో మాజీ, తాజా సీఎంను ఓడించి గెలిచినందున పార్లమెంట్ ఎన్నికల్లోనూ తమ ఉనికిని చాటుకుంటామంటోంది.

మెదక్, జహీరాబాద్‌పై దృష్టి

మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలపై అన్ని పార్టీలు దృష్టి సారించాయి. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఈ రెండు స్థానాల్లోనూ గెలిచి తీరాలన్న పట్టుదలతో వ్యూహాలు పన్నుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో వచ్చిన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని గెలుపు గుర్రాల్ని ఆన్వేషిస్తున్నాయి. కాంగ్రెస్, బీజేపీలు దేశ వ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల్లో తలపడనున్నాయి. ఈ రెండు పార్టీలు సైతం కేంద్రంలో అధికారం కోసం పోటీ పడుతున్నాయి. రెండు పర్యాయాలు గెలిచిన బీజేపీ హ్యాట్రిక్ విజయం కోసం దక్షణాదిపై కేంద్రీకరించింది. కాంగ్రెస్ సైతం ఈ సారి ఎట్టెనా అధికారంలోకి రావాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా బీజేపీ యేతర పార్టీలతో కూటమి కట్టింది. తెలంగాణలో అధికారంలోకి వచ్చినందున అత్యధిక ఎంపీ స్థానాలు గెలుచుకోవాలని చూస్తుంది. బీజేపీ సైతం దక్షణాదిలో ఎంపీ సీట్లు పెంచుకునేందుకు పావులు కదుపుతుంది. అందుకే గతంలో గెలిచిన నాలుగు స్థానాలతో పాటు అదనంగా మరో నాలుగైదు చోట్ల విజయం సాధించాలని చూస్తుంది. ఈ రెండు పార్టీలతో పాటు రాష్ట్రంలో పదేళ్ల పాటు ప్రభుత్వం నడిపిన బీఆర్ఎస్ సైతం సిట్టింగ్ స్థానాల్ని తిరిగి కైవసం చేసుకోవాలని చూస్తుంది. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉమ్మడి మెదక్ జిల్లాలోని అందోల్, నారాయణఖేడ్, జహీరాబాద్‌తో పాటు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని కామారెడ్డి, జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి నియోజకవర్గాలున్నాయి. వీటిల్లో ని అసెంబ్లీ నియోకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో కామారెడ్డిలో బీజేపీ ఎమ్మెల్యే గెలుపొందారు. అందోల్, నారాయణఖేడ్, జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. బీఆర్ఎస్ మాత్రం జహీరాబాద్, బాన్సువాడ రెండు చోట్ల ఎమ్మెల్యేలు గెలిచారు. ఎమ్మెల్యేల స్థానాలు ఎక్కువ గెలిచినందున కాంగ్రెస్ ఈ సారి జహీరాబాద్ పార్లమెంట్ సీట్‌ను దక్కించుకోవాలని చూస్తుంది. సిట్టింగ్ స్థానాన్ని ఎలాగైనా గెలుపొందాలని బీఆర్ఎస్ కూడా పట్టుదలతో ఉంది. బీజేపీ సైతం కామారెడ్డిలో అనూహ్య రీతిలో మాజీ, తాజా సీఎంను ఓడించి గెలిచినట్లే జహీరాబాద్ ఎంపీ సీటును కూడా గెలుచుకుంటామని ఆ పార్టీ ప్రకటిస్తోంది. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఆరు స్థానాల్లో గెలుపొందింది. సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, నర్సాపూర్, సంగారెడ్డి, పటాన్‌చెరులో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. మెదక్‌లో మాత్రం కాంగ్రెస్ ఎమ్మెల్యే గెలిచారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని గజ్వేల్, దుబ్బాకలో బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు పోటీ చేసి ఓడినా బలమైన ఓటు బ్యాంకు సాధించారు. మిగతా చోట్ల కూడా మంచి ఓట్లు వచ్చినందున మెదక్ ఎంపీ సీటు దక్కించుకునేందకు కసరత్తు చేస్తుంది.

అగ్రనేతల కేంద్రీకరణ

మెదక్, జహీరాబాద్ రెండు పార్లమెంట్ నియోజవవర్గాల్లో పోటీ చేసేందుకు బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ అగ్రనేతలు దృష్టి సారించారు. కాంగ్రెస్ అధినేత సోనియాగాంధీ తెలంగాణ నుంచి పోటీ చేయనున్నందున ఆమెను మెదక్ ఎంపీగా పోటీ చేయిస్తారనే ప్రచారం సాగుతోంది. అలాగే జహీరాబాద్ టికెట్ కూడా గెలుపు గుర్రానికి కేటాయించాలని చూస్తున్నారు. బీజేపీ నుంచి ప్రధాని నరేంద్రమోడీ సైతం దక్షణాది నుంచి పోటీ చేస్తారంటున్నారు. ఆయన్ను మల్కాజిగిరి లేదంటే కరీంనగర్ నుంచి పోటీకి దించొచ్చు అనే చర్చ నడుస్తుంది. మోడీ పోటీ చేయడం ద్వారా మెదక్, జహీరాబాద్‌లో బీజేపీ అభ్యర్థుల గెలుపుకు దోహదపడుతుందని ఆ పార్టీ నేతలు ఆశిస్తున్నారు. మరో పక్క బీఆర్ఎస్ మాత్రం రెండు స్థానాలు తమ సిట్టింగ్ సీట్లు అయినందున ఎలాగైనా గెలిచితీరాలంటుంది. మెదక్ ఎంపీగా కేసీఆర్ పోటీ చేస్తే గెలుపుకు అధికంగా అవకాశాలుంటాయని, దీంతో రాష్ట్రంలోని మిగతా 16 ఎంపీ స్థానాల్లోనూ ప్రభావం పడుతుందని బావిస్తున్నారు. కేసీఆర్ పోటీ చేయని పక్షంలో కాంగ్రెస్, బీజేపీలను ఢీకొని గెలిచే అభ్యర్థిని బరిలోకి దించాలని చూస్తున్నారంటున్నారు. జహీరాబాద్ ఎంపీగా రెండు సార్లు గెలిచిన బీబీపాటిల్ మూడో సారి పోటీ చేస్తారా లేక మరొకర్ని పోటీ చేయిస్తారా అనేది పరిశీలిస్తున్నారంటున్నారు. బీజేపీ నుంచి సైతం జహీరాబాద్ టికెట్ కోసం చాలా మంది ప్రయత్నిస్తున్నారు. మాజీ ఎంపీ బాగారెడ్డి కొడుకు జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ ఆలె నరేంద్ర కొడుకు ఆలె బాస్కర్ పోటీ చేయాలని చూస్తున్నారంటున్నారు. మెదక్ నుంచి రఘునందన్‌రావు, ఈటెల రాజేందర్, డాక్టర్ రాజు గౌడ్ పేర్లు కూడా పరిశీలిస్తున్నారంటున్నారు. ఎంపీ స్థానాలు కీలకంగా బావిస్తున్న మూడు పార్టీలు సైతం మెదక్, జహీరాబాద్ ఎంపీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి.

బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాలు కావడంతో మెదక్, జహీరాబాద్ ఎంపీ స్థానాలపై కాంగ్రెస్, బీజేపీలు దృష్టి పెట్టాయంటున్నారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయినందున ఆ పార్టీకి ఎక్కువ మంది ఎమ్మెల్యేలున్న ఈ రెండు ఎంపీ సీట్లలో ఓడిస్తే కాంగ్రెస్ తిరుగులేని శక్తిగా ఉంటుందనే అంచనాలో ఆ పార్టీ నేతలున్నారు. అయితే బీఆర్ఎస్ మాత్రం తమ పట్టు నిలుపుకోవడమే కాకుండా అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన చేదు అనుభవాల నుంచి బయటపడాలని చూస్తుంది. ఎంపీ స్థానాల్ని గెలుచుకోవడం ద్వారా పార్టీని నిలుపుకోవడమే కాకుండా పూర్వ వైభవాన్ని సంతరించుకునేందుకు పార్లమెంట్ ఎన్నికలు దోహదపడతాయని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఎమ్మెల్యేలుగా ఉన్న మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంపై బీఆర్ఎస్ ఎంత శ్రద్ధ పెడుతుందో కాంగ్రెస్ కూడా బలమైన అభ్యర్థిని పోటీ చేయించడం ద్వారా పై చేయి సాధించాలని చూస్తుంది. బీజేపీ మాత్రం జహీరాబాద్ ఎంపీ స్థానంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. మెదక్, జహీరాబాద్‌లో పూర్వ వైభవాన్ని కొనసాగించాలంటే బీఆర్ఎస్ రెండు చోట్ల గెలిచి తీరాలని చూస్తుండగా కాంగ్రెస్ కూడా అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన చేదు అనుభవాలను దృష్టిలో పెట్టుకుని గెలిచే అభ్యర్థుల్ని పోటీ చేయించాలనుకుంటుంది.

సిద్దిపేట జిల్లాలో విద్యుత్ బకాయిలు

రూ.43.08 కోట్లు

అసెంబ్లీలో చర్చకు తెచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి

నవ తెలంగాణ- గజ్వేల్



సిద్దిపేట జిల్లాలో పేరుకుపోయిన విద్యుత్ బకాయిల మీద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడారు. గురువారం అసెంబ్లీలో విద్యుత్‌పై శ్వేతపత్రం విడుదల చేశారు. కేసీఆర్ నియోజకవర్గంలో గజ్వేల్, మాజీ మంత్రి హరీశ్‌రావు నియోజకవర్గం సిద్దిపేటలో విద్యుత్ బకాయిలు భారీగా పేరుపోయినట్లు గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో కీలక పదవుల్లో ఉన్న వ్యక్తుల ప్రాంతాల్లో భారీగా బకాయిలు పేకుపోతే ఎలా అని ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లాలో విద్యుత్ బకాయిలు తలకు మించిన భారంగా మారాయని తెలిపారు. వీధి దీపాలు, ఇండ్ల కనెక్షన్ కరెంటు బిల్లులు భారీగా పేరుకుపోయాయని చెప్పారు. జిల్లాలో అన్ని విభాగాల్లో కలిపి 5.24 లక్షల కలెక్షన్ ఉన్నాయని, హెచ్‌టీ విద్యుత్ సరఫరా చేసేందుకు 15 పెద్ద ఉప కేంద్రాలు, 170 చిన్న విద్యుత్ ఉప కేంద్రాలు ఉన్నాయని, ఎల్‌టీ విద్యుత్ సరఫరా కోసం 25 వేల వరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయని తెలిపారు. ఐదు చోట్ల మరమ్మతు కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో రోజుకు సగటున 8 మిలియన్ల యూనిట్ల వరకు విద్యుత్ వినియోగం అవుతోందన్నారు. వీధి దీపాలు, వాటర్ వర్కర్స్ సంబంధించి బిల్లులు రూ.12.80 కోట్లు, కార్యాలయాలకు సంబంధించి రూ 3.25 కోట్ల పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయం నిర్మాణంలో భాగంగా పెండింగ్ పద్దులను చెల్లించే అవకాశం ఉందన్నారు. అధికారులు శ్రద్ధ చూపకపోవడంతో బకాయిలు పేరుకుపోయినట్లు తెలిపారు. గతంలో బిల్లును చెల్లించలేదని గజ్వేల్ తహసీల్దార్ కార్యాలయానికి కరెంటు నిలిపివేశారని గుర్తు చేశారు. దీంతో కొన్ని రోజులు సెల్ఫోన్ వెలుతురులో పనులు చేపట్టే పరిస్థితికి వచ్చిందంటే అధికారుల తీరు ఎలా ఉందో తెలుస్తుందన్నారు. విద్యుత్ బకాయిల వసూలుపై అధికారులు దృష్టి సారించాలని చెప్పారు. రైతుల నుంచి ఒక సర్వీస్ కనెక్షన్‌కు నెలకు రూ.30 చొప్పున సేవా రుసుం వసూలు చేస్తున్నారని, ఇందుకు సంబంధించినవే జిల్లాలో భారీగా బిల్లులు పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. ఈ విషయంలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చైతన్యవంతులను చేయాలని తెలిపారు. జిల్లాలో భారీగా విద్యుత్ బకాయిలు పెరిగి విద్యుత్ సంస్థకు తలనొప్పిగా మారాయని తెలిపారు.

సిద్దిపేట జిల్లాలో బకాయిలు రూ.43.08 కోట్లు

ఇండ్ల విద్యుత్ బకాయిలు రూ.6.04 కోట్లు, వాణిజ్యం నుంచి రూ.4.05 కోట్లు, పరిశ్రమల నుంచి రూ.0.30 కోట్లు, వ్యవసాయం నుంచి రూ.15.57 కోట్లు, వీధి దీపాలు, వాటర్ వర్క్స్ నుంచి రూ.12.80 కోట్లు, బడులు, దేవాలయాల నుంచి రూ.1.07 కోట్లు, ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.3.25 కోట్ల బకాయి ఉన్నట్లు సీఎం ప్రకటించారు. సిద్దిపేట జిల్లాలో మొత్తం రూ.43.08 కోట్ల బకాయి ఉన్నట్లు సీఎం చెప్పారు.

ఇంటర్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ రాజర్షిషా

నవతెలంగాణ - మెదక్



ఇంటర్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మెదక్ జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంచాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో ఇంటర్ కళాశాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో రెండు నెలల్లో పబ్లిక్ పరీక్షలు ఉన్నాయని, విద్యార్థులు, తల్లితండ్రులు, అధ్యాపకులు సమష్టిగా ఇంటర్‌లో మంచి ఫలితాల కోసం ప్రయత్నం చేయాలని సూచించారు. విద్యార్థులు ఫోన్ ఇతర సోషల్ మీడియాకు దూరంగా ఉండి తల్లితండ్రుల కష్టానికి ఫలితం అందించాలన్నారు. జిల్లాలోని అన్ని కళాశాలల్లో ఈ నెల 28న పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించి విద్యార్థులను ఏబీసీడీ గ్రూపుగా విభజించాలని తెలిపారు. జనవరి 1 నుంచి ఇంటర్ విద్యార్థులకు స్పెషల్ స్టడీ అవర్స్, స్పెషల్ స్లిప్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. డిసెంబర్ నెలాఖరు వరకు సిలబస్ పూర్తి చేయాలన్నారు. ప్రతి విద్యార్థికి స్టడీ మెటీరియల్ అందించామన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. డ్రాప్‌ఔట్ శాతం తగ్గించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ రమేష్ జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ, డీఈవో రాధా కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్రం

- ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయటం తగదు
- పార్లమెంట్ భద్రతపై చర్చ జరగాలి
- 22న దేశ వ్యాప్త నిరసనలో ప్రజలు పాల్గొనాలి
- సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

నవతెలంగాణ పటాన్‌చెరు



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది. పార్లమెంట్‌లో ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయటం తగదు. పార్లమెంట్ భద్రతపై చర్చ జరగాలి. 22న దేశ వ్యాప్త నిరసనలో ప్రజలు పాల్గొనాలి' అని సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. 'కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్ష ఎంపీల హక్కులను కాలరాస్తున్నారు. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారు. పార్లమెంట్ భద్రతపై చర్చ జరగాలని పట్టుబట్టిన ఎంపీలను నిర్దాక్షణంగా సస్పెండ్ చేయడం సరైందికాదు' అని తీవ్రంగా ఖండించారు. గురువారం పటాన్చెరు మండల కమిటీ సమావేశంలో జయరాజు మాట్లాడుతూ ఇప్పటికి 143 మంది ఎంపీలపై సస్పెన్షన్ విధించిందని, ఈ చర్య ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టుగా అభివర్ణించారు. దేశ ప్రజల సమస్యలు, దేశ భద్రతపై పార్లమెంట్‌లో చర్చించాల్సిన కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాల పార్టీల ఎంపీలపై వేటు వేసి మూజువాణి ఓట్లతో తమకు అనుకూలమైన చట్టాలను చేసుకుంటోందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్ సంప్రదాయాన్ని ఉల్లంఘిస్తూ ఎంపీల హక్కులను కాలరాస్తూ సస్పెండ్ చేయటాన్ని వ్యతిరేకిస్తూ ప్రతిపక్షా పార్టీల పిలుపులో భాగంగా ఈ నెల 22న దేశవ్యాప్తంగా జరుగు నిరసన కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములై బీజేపీ అప్రజాస్వామిక విధానాలను వ్యతిరేకించాలని కోరారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా ప్రతిపక్ష పార్టీలు కలిసికట్టుగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నర్సింహారెడ్డి, నాయకులు పాండు రంగారెడ్డి, వాజిద్ అలీ నగేశ్రావు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పన కోసం 12న ఛలో పార్లమెంట్

ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్

నవ తెలంగాణ - సిద్దిపేట



ఉచిత విద్య, ఉపాధి కల్పన కోసం జనవరి 12న ఛలో పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ తెలిపారు. గురువారం పాత బస్టాండ్ అంబేద్కర్ వద్ద చలో ఢిల్లీ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. దేశంలో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు, అందరికీ ఉచిత విద్య, ఉపాధి కల్పించాలని జనవరి 12న చలో పార్లమెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి 3 శాతం నిధులు మాత్రమే కేటాయిస్తున్నారని తెలిపారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ప్రభుత్వ విద్యా సంస్థలకు సరిపడా నిధులు కేటాయించాలని కోరారు. దేశంలో ఎన్నడూ లేనంత నిరుద్యోగం తీవ్రంగా పెరిగిందన్నారు. సంవత్సరానికి 10 లక్షల ఉద్యోగాలు కల్పిస్తానన్న కేంద్ర ప్రభుత్వ హామీ ఏమైందని ప్రశ్నించారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో నిరసనలు వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. జరిమానాలు విధిస్తున్నారన్నారు. ప్రశ్నించే గొంతుకులను నిర్బంధించే చర్యలు ప్రజాస్వామ్యంలో ఉండరాదన్నారు. దేశంలో అత్యంత ప్రతిష్టాత్మక జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో నిరసన తెలిపితే రూ.20 వేల జరిమానా విధిస్తామని వైస్ ఛాన్సర్ సర్క్యులర్ జారీ చేయడం అప్రజాస్వామికమన్నారు. నూతన జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా ఎన్‌టీఏ ద్వారా అన్ని రకాల జాతీయస్థాయి పోటీ పరీక్షలను కేంద్రమే నిర్వహించాలని చూస్తోందన్నారు. జాతీయస్థాయి పోటీ పరీక్షలన్నీ ఎన్‌టీఏ నిర్వహించడం ద్వారా అధికార కేంద్రీకృతమై తమిళనాడులో జాతీయస్థాయి మెడికల్ ఎంట్రన్స్ టెస్ట్‌లో అవకతవకలు జరిగిన మాదిరిగా ఇతర పోటీ పరీక్షల్లో జరిగే అవకాశం ఉందన్నారు. ఎన్‌టీఏ గొడుగు కింద జాతీయస్థాయి పోటీ పరీక్షలు అన్నీ నిర్వహించడం సరైన నిర్ణయం కాదన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ విద్యార్థులకు ఇచ్చే జాతీయస్థాయి ఫెలోషిప్‌లు కోత విధిస్తున్నారని తెలిపారు. ఈ కారణం చేతనే జాతీయ విశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. అందరికీ ఉచిత విద్య, ఉపాధి కల్పించాలని చేపట్టబోయే చలో పార్లమెంట్ కార్యక్రమానికి ప్రజాస్వామికవాదులు అందరూ మద్దతు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్, నాయకులు మహమ్మద్ షారుక్ ఖాన్, అంజి, అశోక్, పవన్, చందు, రాజు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌పై కక్షసాధింపు చర్యలు సరికావు

మెదక్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీస్ ఎదుట గాజిరెడ్డిపల్లివాసుల నిరసన

నవతెలంగాణ - మెదక్



అటవీ భూమి ఆక్రమణ కేసులో బీఆర్ఎస్ నేతను అక్రమంగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తూ పలువురు గురువారం మెదక్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీస్ ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ వైస్ చైర్మన్ లావణ్యరెడ్డి మాట్లాడుతూ మెదక్ జిల్లా హవేలీఘనపూర్ మండలం గాజిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సాప సాయిలు ఫారెస్ట్ భూమిని ఆక్రమించాడనే నెపంతో 2020లో ఫారెస్ట్ అధికారులు అక్రమ కేసు బనాయించినట్లు తెలిపారు. ఆ కేసు విషయంలో గురువారం తెల్లవారుజామున ఫారెస్ట్ అధికారులు జులుం ప్రదర్శిస్తూ సాప సాయిలును అక్రమంగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాలు వస్తాయి పోతాయని, ప్రస్తుత ప్రభుత్వం బీఆర్ఎస్ కార్యకర్తలపై రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి నాలుగు ఎకరాలు ఫారెస్ట్ భూమిని ఓ వ్యక్తి కబ్జా చేస్తే రూ.2 లక్షలు లంచం తీసుకొని కేసు నమోదు చేయలేదని ఆరోపించారు. సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా గాజిరెడ్డిపల్లిలో తాము 4 వేల మొక్కలు నాటితే అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జేసీబీతో మొక్కలన్నింటినీ తొలగించారని, అప్పుడు ఫారెస్ట్ అధికారులు ఎలాంటి చర్య తీసుకోలేదని గుర్తు చేశారు. స్టేషన్‌బెయిల్ ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని బైఠాయించారు. సుమారు గంట వరకు కొనసాగిన ఆందోళన తరువాత సాయిలుకు స్టేషన్ బెయిల్ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ భాగ్యలక్ష్మిశీను, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, శ్రీహరి, దాసు, పోచయ్య, భీమయ్య, రంజా నాయక్, దం సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ కమిటీ వేయాలి

నవతెలంగాణ - మెదక్



అధికార బలంతో బీఆర్ఎస్ నాయకులు చేసిన అవినీతి, అక్రమాలపై కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి విచారణ కమిటీ వేయాలని ఎమ్మెల్యే రోహిత్‌ను కోరనున్నట్లు కాంగ్రెస్ జిల్లా నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మెన్ సురేందర్‌గౌడ్, న్యాయవాది జీవన్‌రావ్ పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అధికారులపై పెత్తనం చెలాయించడమే కాకుండా, ఫారెస్ట్ బీట్ అధికారులపై దాడులు చేయించారని తెలిపారు. హవేలీఘనపూర్ మండలం గాజిరెడ్డిపల్లికి చెందిన బీఆర్ఎస్ నేత సాపసాయిలు లింగంపేట బ్లాక్, గాజిరెడ్డిపల్లి బీట్, కంపార్ట్ మెంట్ నెం 96లో 0.31 గుంటల రిజర్వ్ ఫారెస్ట్ భూమిని ఆక్రమించడంతో 2020 సెప్టెంబర్ 17న ఫారెస్ట్ ఆక్ట్ ప్రకారం బీట్ ఆఫీసర్ ఎండీ అజీజ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అప్పట్లో అధికార బలంతో ఉన్న పద్మాదేవేందర్‌రెడ్డి సాయిలును కాపాడటమే కాకుండా అధికారులపై ఇష్టానుసారంగా వ్యవహరించినట్లు ఆరోపించారు. చట్టం తన పని తాను చేసుకు పోతుంటే జెడ్పీ వైస్ చైర్మన్ లావణ్యరెడ్డి అడ్డుకోవడమే కాకుండా విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నట్లు తెలిపారు. బీట్ అధికారుల మీద దాడి చేశారనే కారణంతో ఈ నెల 10న బీట్ అధికారి మూడావత్ హరినాయక్ హవేలీఘనపూర్ పోలీస్‌స్టేషన్‌లో సాప సాయిలుపై ఫిర్యాదు చేస్తే ఎఫ్ఐఆర్ నమోదు అయినట్లు తెలిపారు. ఇందులో ప్రస్తుత ఎమ్మెల్యే రోహిత్ జోక్యం లేదని తెలిపారు. మెదక్ మండలం బొల్లారం గ్రామంలోని సర్వేనెం 33లో 130 ఎకరాల విస్తీర్ణం ఉందని, అందులో సుమారు 30 ఎకరాలను 1977లో సీలింగ్ చట్టం కింద గిరిజనులకు అందజేశారన్నారు. గిరిజనులకు, దళితులకు ఇచ్చిన 30 ఎకరాలతో పాటు ప్రక్కనే ఉన్న 30 ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్ భూమిని కలిపి మొత్తం 60 ఎకరాల భూమిని జెడ్పీ వైస్ చైర్మన్ లావణ్యరెడ్డి దౌర్జన్యంగా బెదిరించి లాక్కొని కబ్జా చేసుకొని ఫెన్సింగ్ వేసినట్లు ఆరోపించారు. కౌన్సిలర్ ఆవారి శేఖర్, బొజ్జ పవన్, మార్గం నాగరాజు, శ్రీకాంత్, బొల్లారం ఉప సర్పంచ్ శివ రాథోడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మున్నా, మైసన్ లతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, గాజిరెడ్డిపల్లి, బొల్లారం గ్రామస్థులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

నేటి కృతజ్ఞత సభను జయప్రదం చేయండి

నవతెలంగాణ-జిన్నారం



నేడు (ఈనెల 22న శుక్రవారం) పటాన్చెరు పట్టణంలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధ్యక్షతన. మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా నిర్వహించ తలపెట్టిన టిఆర్ఎస్ శ్రేణుల కృతజ్ఞత సభను జయప్రదం చేసేందుకు పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రాజేష్ విజ్ఞప్తి చేశారు. సంగారెడ్డి జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు కుంచాల ప్రభాకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత జిన్నారం వెంకటేశం గౌడ్, ఆయా గ్రామాల బి ఆర్ ఎస్ పార్టీ సర్పంచులు ఎంపీటీసీలు నాయకులు పెద్ద ఎత్తున కృతజ్ఞత సభకు తరలిరానున్నట్టు ఆయన తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

నవతెలంగాణ-జహీరాబాద్



జహీరాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన నూతన ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పట్టణ ఎస్సై శ్రీకాంత్ హెచ్చరించారు. జహీరాబాద్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం, భవాని మందిర్ రోడ్ కుమార్ హోటల్ వద్ద ప్రత్యేక ట్రాఫిక్ నిబంధనలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇందుకు ప్రయాణికులందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రోడ్డు ప్రమాదాలను నిర్వహించాలన్న లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. కాబట్టి ప్రతీ ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు.



కాంగ్రెస్‌ది ప్రజా పాలన..

నవతెలంగాణ-జిన్నారం

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో అద్భుతమైన పాలన ప్రజలకు లభిస్తున్నదని.. కాంగ్రెస్‌ది ప్రజా పాలన అని పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ అన్నారు. జిన్నారం ఎంపీటీసీ కొరబోయిన లావణ్య నరేష్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్‌లో చేరేందుకు రాగా.. వారికి కాటా శ్రీనివాస్ గౌడ్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని కష్టకాలంలో ఆదరించి వెన్నుదన్నుగా నిలిచిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానంగా ప్రవీణ్, బాలు, రవి, రాజేష్ , సాయిలు, లక్ష్మీపతి గూడెం విజయ్, యాదగిరి , నరేందర్, సాయి, టి నరేష్ ల ను కాటా శ్రీనివాస్ గౌడ్ ప్రత్యేకంగా అభినందించారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 6 గ్యారంటీలకు యువకులు మద్దతునందిస్తూ పార్టీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, జిన్నారం ఎంపీపీ రవీందర్ గౌడ్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుల నరేందర్ , శంకరయ్య, కోటేష్ గౌడ్, వినోద్, జిన్నారం మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కాంగ్రెస్ గంగు రాజు, శ్రీధ ర్ రెడ్డి, గోపాల్ రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో 'పాలిటెక్నిక్ కళాశాలల ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్'

జహీరాబాద్ కళాశాల విద్యార్థులకు మొదటి, గజ్వేల్ విద్యార్థులకు ద్వితీయ బహుమతి

నవతెలంగాణ-జహీరాబాద్

ఉమ్మడి మెదక్ జిల్లా పాలిటెక్నిక్ కళాశాలల ప్రాజెక్టు ఎగ్జిబిషన్‌ను జహీరాబాద్‌లోని సంగమేశ్వర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ కుమారస్వామి స్థానిక కళాశాలలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలోని వివిధ కళాశాలలో నిర్వహించిన టెక్నీషియన్ ప్రాజెక్టుల్లో ఉత్తీర్ణత కనబరిచిన బృందాలు.. ఈ జిల్లా స్థాయి పోటీలో పాల్గొన్నాయన్నారు. ఈ పోటీల్లో ప్రధానంగా మెకానికల్ విభాగానికి చెందిన 30 మంది విద్యార్థులు.. బృందాలుగా తయారు చేసిన వివిధ పరికరాలతో వాటి పని విధానాన్ని తెలిపి ప్రతిభను చాటుకున్నారు. ఇందులో గజ్వేల్ నరసాపూర్ సంగారెడ్డి, జహీరాబాద్, జోగిపేట్, చేగుంటలలోని పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. బీవీఆర్టి కళాశాల డీన్ కొమరయ్య, మహేంద్ర అండ్ మహేంద్ర అధికారులు మురళీకృష్ణ గౌడ్, మహేశ్వర్ రెడ్డి, మెకానికల్ డీన్ శ్రీనివాస్ రెడ్డిలు ఆయా పరికరాలను పరిశీలించి విజేతలను నిర్ణయించారు. జహీరాబాద్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు తయారుచేసిన ఆటోమెటిక్ సేవింగ్ మిషన్ యంత్రానికి మొదటి బహుమతి, గజ్వేల్ కళాశాలకు చెందిన







విద్యార్థులు తయారు చేసిన వైర్లెస్ రోబో ద్వారా పంటపొలాల్లో మందుల పిచికారి రోబోను ద్వితీయ బహుమతిగా ఎంపిక చేశారు. జిల్లా స్థాయిలో రాణించిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా కళాశాలల నిపుణులతో పాటు స్థానిక కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైనర్‌పై లైంగికదాడి కేసులో నిందితుడి రిమాండ్

నవతెలంగాణ-జోగిపేట

మైనర్‌పై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు జోగిపేట ఎస్ఐ అరుణ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్ సమీపంలోని కుస్‌చారం గ్రామానికి చెందిన పవన్ అనే వ్యక్తి జోగిపేటకు చెందిన ఓ మైనర్‌ను ప్రేమిస్తున్నానని మాయ మాటలు చెప్పి.. గత మూడు నెలల క్రితం ఆ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గుర్తించిన సదరు మైనర్ బాలిక కుటుంబీకులు.. పవన్‌పై ఆగస్టు నెలలో జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని అచూకి కోసం అప్పటి నుంచి గాలిస్తున్న పోలీసులు.. పవన్ తాండూర్ ఏరియాలో ఉన్నాడన్న నమ్మదగిన సమాచారం రావడంతో.. గురువారం ఉదయం పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

పారిశుధ్య సిబ్బందితో జన్మదిన వేడుకలు

- రూ.10 లక్షల విలువ చేసే ప్రమాద బీమా బాండ్స్ పంపిణీ
- దాతృత్వాన్ని చాటుకున్న కిష్టారెడ్డిపేట ఈవో సందిల బలరాం

నవతెలంగాణ-అమీన్‌పూర్

కిష్టారెడ్డిపేట గ్రామపంచాయతీ కార్యదర్శి సంధిల బలరాం తన కుమార్తె ప్రియాన్సు ఎనిమిదో జన్మదిన వేడుకలను.. ఆయన విధులు నిర్వహిస్తున్న కిష్టారెడ్డిపేట గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి గురువారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి శానిటేషన్ కిట్లు పంపిణీ చేశారు. ఉద్యోగరీత్యా కుటుంబం కంటే ఎక్కువ సమయం సిబ్బందితోనే గడుపుతున్నానని.. నిత్యం కలిసి ఉండే పారిశుధ్య సిబ్బందిని తన కుటుంబ సభ్యులుగా భావిస్తున్నానని.. వారి సమక్షంలో తన కుమార్తె జన్మదిన వేడుకలు చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక నేతలు ఆయన్ను ప్రశంసిస్తూ.. కూతురు పుట్టినరోజు సందర్భంగా కార్మికులకు రూ.10లక్షల ప్రమాద బీమా చేయించడం గొప్ప విషయమన్నారు. జన్మదిన వేడుకలు అంటే ఒకరోజు ముందే మొదలుపెట్టి హంగు ఆర్భాటాలతో లక్షల రూపాయలు వృథా చేసే వారు ఈవో బలరాం లాంటి వాళ్ళని ఆదర్శంగా తీసుకొని వేడుకలు జరుపు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కిష్టారెడ్డిపేట గ్రామ సర్పంచ్ ఏర్పుల కృష్ణ, అమీన్పూర్ వైస్ ఎంపీపీ సునీత సత్యనారాయణ స్థానిక బిఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ , వెంకటేష్ పాల్గొన్నారు.



ఈనెల 30న నేషనల్ లోక్ అదాలత్



నవతెలంగాణ-జోగిపేట

ఈనెల 30న నేషనల్ లోక్ అదాలత్ కార్యక్రమం ఉంటుందని డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ సెక్రెటరీ హనుమంతరావు తెలిపారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ జోగిపేట ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మరియు స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాలతో కోర్టులో నేషనల్ లోక్ అదాలత్ కార్యక్రమం పై గురువారం అవగాహనా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తగిన కేసులకు అదే రోజు పరిష్కారం దొరుకుతుందని, రాజీ అనేది మరి ఎక్కడా కూడా అప్పీల్ చేయడానికి వీలు లేనటువంటి'దన్నారు. ఇరు వర్గాలు న్యాయం పొందే విధంగా లోక్ అదాలత్ తీర్పులు చెప్పబడతాయన్నారు. భార్యాభర్తలు మధ్య ఉన్న కేసులు, భూమికి సంబంధిత కేసులు, రాజీ పడదగినటివంటి కేసులు ఐపీసీ సివిల్ కేసులు, బ్యాంక్ కేసులు, పీఎల్‌సీ కేసులు పరిష్కరించబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ధనలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడ వెంకటరామ్ రెడ్డి, బార్ మెంబర్స్ నారాయణ రెడ్డి, శ్రీకాంత్, నరసింహులు, ఇంద్రసేనారెడ్డి, జోగిపేట పోలీస్ సర్కిల్ పరిధిలోని అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో కురుమల సత్తా చాటాలి

నవతెలంగాణ-మునిపల్లి



రాబోయే పంచాయతీ ఎన్నికల్లో కురుమల సత్తా చాటాలని కురుమ సంఘం మండలాధ్యక్షుడు తాటిపల్లి మల్లేశం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 30 గ్రామాల్లో 27 గ్రామాల్లో కురుమ కుటుంబాలు ఉన్నాయన్నారు. కాబట్టి సార్వత్రిక గ్రామ పంచాయతీలకు జరిగే ఎన్నికల్లో ఓపెన్ క్యాటగిరి, బీసీ రిజర్వేషన్ వస్తే.. కురుమ సోదరులు సర్పంచులు, వార్డు మెంబర్లకు గా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.



ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించాలి

నవతెలంగాణ-పుల్కల్

విద్యార్థులకు మత భోదనలు నేర్పుతున్న పుల్కల్ మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామ శివారులో గల ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి ఎఫ్సిబాను వెటనే విధుల నుంచి తొలగించాలని ఏబీవీపీ నాయకులు జిల్లా విద్యాధికారికి గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బుధ వారం రోజున పాఠశాలలో విద్యార్థులందనీ ఏకం చేసి.. అందరూ ఏసు క్రీస్తు మార్గంలో నడవాలని సదరు (పిన్సిపాల్ సూచించనట్టు చెప్పారు. పాఠశాలలో మత ప్రచారానికి పాల్పడిన ఆ ప్రిన్సిపాల్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకట్ రెడ్డి, నాయకులు తానాజీ, నిఖిల్, పాండు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికి హానికరం

నవతెలంగాణ-రాయికోడ్

పొగాకు ఉత్పతులు ఆరోగ్యానికి హానికరం అని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం సూపర్‌వైజర్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా గురువారం రాయికోడ్‌లోని ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో, మార్కెట్‌లో, బస్టాండ్ వద్ద పొగాకు వాడకం వల్ల కలిగే అనార్థాలను గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు పొగాకు వాడకంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పొగాకు ఉత్పత్తులైన బీడీ చుట్ట సిగరెట్ జర్దా, తంబాకు, పాన్ మసాలా లాంటి వాటిని ఉపయోగించొద్దన్నారు. వాటి వాడకంతో మనుషుల్లో హైపర్ టెన్షన్, నోటి క్యాన్సర్, శ్వాసకోస, గుండె సంబంధిత వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం సెక్షన్ 4 ప్రకారం నేరమని.. అందుకు రూ.200 జరిమానా విధిస్తారన్నారు. పొగాకు ఉత్పత్తుల పోస్టర్లను అడ్వర్టైజ్‌లను వేయడం సెక్షన్ 5 ప్రకారం నేరమన్నారు. ఈ చర్యకు రెండేండ్ల పాటు జైలు శిక్ష విధిస్తారన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ పాఠశాలల్లో హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. పొగాకు వాడకానికి ప్రతీ ఒక్కరు దూరంగా ఉండాలని.. అప్పుడే వారి ఆరోగ్యం బాగుంటుందన్నారు.



పేదలకు బ్లాంకెట్స్ పంపిణీ



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట పట్టణంలోని నిరుపేదలకు, అనాథలకు బ్లాంకెట్‌లను పంపిణీ చేసినట్టు లయన్స్ క్లబ్ డిస్టిక్ జాయింట్ క్యాబినెట్ సెక్రటరీ రూరల్ డాక్టర్ కే. అనంతరెడ్డి తెలిపారు. జీఎస్టీ జిల్లా కోఆర్డినేటర్ నరసింహారాజు ఆదేశాలతో బ్లాంకెట్ ఛాలెంజ్ కార్యక్రమంలో భాగంగా జోగిపేట లయన్స్ క్లబ్‌సభ్యులు విట్టల్‌రావు తాన్లే సహకారంతో.. బుధవారం అర్ధరాత్రి పట్ట ణంలో చలికి వణుకుతూ నిద్రపోతున్న పలువురికి బ్లాంకె ట్లను అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లా డుతూ.. లయన్స్ క్లబ్ నిరంతరం సేవా కార్యక్రమాలు చేప డుతున్నదన్నారు. పేదలను ఆదుకు నేందుకు అనేక కార్యక్ర మాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ నిరుపేదలకు తగిన విధంగా సహాయ సహకారాలు అందించాలని కోరా రు.కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్పర్సన్ ఆకుల రాంబాబు, పట్టణ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, సభ్యులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యం, ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-జోగిపేట



ఓపక్క అనారోగ్యం, మరోపక్క ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అందోల్ మండల పరిధిలోని పోసానిపేట గ్రామంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పోసానిపేటకు చెందిన గంట గోపాల్(40) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దానికితోడు ఆర్థిక సమస్యలు కూడా చుట్టుముట్టాయి. దాంతో తీవ్ర మనస్తాపం చెందిన అతడు.. గురువారం తామర చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుడి కుటుంబ సభ్యులు జోగిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బిగ్‌బాస్ షోను నిషేధించాలి

- షో నిర్వాహకులపై కేసులు పెట్టాలి
- సీపీఐ సంగారెడ్డి జిల్లా కమిటీ డిమాండ్



నవతెలంగాణ-సంగారెడ్డి

బిగ్‌బాస్ షోను నిషేధించి.. ఆ షో నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) సంగారెడ్డి జిల్లా సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ఏ. రహమాన్ గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. మూడ్రోజుల క్రితం బిగ్‌బాస్-7 విజేత పల్లవి ప్రశాంత్.. షో హాల్ నుంచి బయటకు వచ్చినప్పుడు జరిగిన హింసాత్మక ఘటన దారుణమైనదన్నారు. ఇలాంటి ఘటన జరుగుతుందని.. జాతీయ కార్యదర్శి డాక్టర్ కే.నారాయణ ముందే గ్రహించారన్నారు. ఆ నేపథ్యంలోనే గతంలో హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా సజ్జనర్ ఉన్నప్పుడు.. బిగ్‌బాస్ షోను నిషేదించాలని ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. కానీ ఈ ఫిర్యాదు పై ఎలాంటి చర్యలు తీసుకోకుండా పెండింగ్‌లో పెట్టారన్నారు. రెండుమూడ్రోజుల తర్వాత.. ఆ కేసు తన పరిధిలోకి రాదని బదిలిచ్చారన్నారు. నారాయణ కోర్టులను ఆశ్రయించగా.. కోర్టు కూడా న్యాయం చేయలేక పోయింద'న్నారు. ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్న బిగ్‌బాస్ షోకు అధికారులు, ప్రభుత్వాలు వత్తాసు పలుకుతున్నారన్నారు. రియాల్టీ షో పేరుతో కొంతమంది యువకులు, యువతులను ఒకే ఇంట్లో ఉంచి.. అశ్లీలత, పాశ్చాత్య సంస్కృతిని బలపరుస్తున్నారని మండిపడ్డారు. ఈ షో వల్ల యువత పెడదారి పట్టే ఆస్కారం ఉన్నదన్నారు. దేశానికి ఆదర్శంగా నిలువాల్సిన సినిమా హీరో అక్కినేని నాగార్జున.. డబ్బుల కోసం ఇలాంటి అశ్లీలత షోలకు యాంకరింగ్ చేయడం సిగ్గుచేటన్నారు. యువతను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు బిగ్‌బాస్‌షోను వెంటనే నిషేధించి.. షో నిర్వాహకులపై కేసులు పెట్టి తగిన గుణపాఠం నేర్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య, అఫ్రోజ్, చింత గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో జాప్యం.. విద్యార్థులకు శాపం

- ఆరు నెలలుగా ముందుకు సాగని నిర్మాణ పనులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ-పుల్కల్

పుల్కల్ మండల కేంద్రంలో ఉన్న ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణాన్ని మధ్యలో నిలిపివేయడంతో.. భవనం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరు నెలల క్రితం పాత భవనాన్ని కూల్చివేసి.. ఆ స్థలంలో నూతన భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. అయితే కేవలం పిల్లర్లు వేసి రెండు అంతస్తుల్లో స్లాబ్ చేశారు తప్పా.. ఇంకా పనులేం చేపట్ట లేదు. దాంతో పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండా, వాన, చలితో నరకయాతన అనుభవిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి.. భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇదే విషయమై మండల విద్యాధికారి అంజయ్యను ఫోన్‌లో వివరణ కోరగా.. ఈ నూతన భవన నిర్మాణానికి, నాకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఆ భవనాన్ని ఎవరు నిర్మిస్తున్నారో.. ఆ కాంట్రాక్టర్ కూడా నాకు తెలియదని చెప్పారు.

పై అధికారులతో మాట్లాడి పూర్తి చేస్తాం..

పుల్కల్ పాఠశాల టెండర్లు వేసేటప్పుడు నేను లేను. ఇటీవలే సంగారెడ్డి జిల్లా విద్యాధికారిగా వచ్చాను. కాగా పుల్కల్ మండలంలో ఇలాంటి పాఠశాల భవనాలు చాలా మేరకు పెండింగ్‌లో ఉన్నాయి. అసలు ఆ భవనాలు నిర్మించేది ఎవరు.. దానికి కాంట్రాక్టర్ ఎవరనేది తెలుసుకొని, మధ్యలో ఆగిన పాఠశాల భవనాలను పూర్తి చేసే విధంగా పై అధికారులతో మాట్లాడుతా. తొందరలోనే ఆ భవనాలను అందుబాటులోకి తెచ్చే విధంగా పని చేస్తా. ఈ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఎలాంటి అపోహలకు గురికాకుండా ఈమ చదువులను పూర్తి చేసుకోవాలి. అంతేకాకుండా 2024లో జరిగే పరీక్షల్లో అన్ని గ్రామాల యువతి యువకులు మొదటి స్థానంలో నిలువాలి. చదువులో జిల్లాలోనే పుల్కల్ ఉమ్మడి మండలాన్ని ముందుంచాలి.

-జిల్లా విద్యాధికారి

22న ఖేలో ఇండియా మహిళల రగ్బీ క్రీడాకారుల ఎంపికలు



నవతెలంగాణ-చేగుంట

చేగుంటలోని ఆదర్శ పాఠశాల ఆవరణలో ఈ నెల 22వ తేదిన అండర్ 14, అండర్ 18, సీనియర్ మహిళల ఖేలో ఇండియా రగ్బీ పోటీల ఎంపికలు ఉన్నాయని కోచ్ కర్ణం గణేష్ రవికుమార్ పేర్కొన్నారు. ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారిణిలు ఉదయం 9 గంటలకు ఆదర్శ పాఠశాల పిడి వెంకటేష్‌కు తమ తమ ఆధార్ కార్డు, జన్మదిన ధ్రువపత్రాతోపాటు, బ్యాంక్ అకౌంట్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు తీసుకురావాలని ఆయన తెలిపారు. ఇక్కడ మంచి ప్రతిభ చూపిన క్రీడాకారిణిలను ఈ నెల 23, 24 తేదీల్లో సికింద్రాబాద్‌లోని రైలు నిలయం పక్కన గల ఆర్‌సీబీ గ్రౌండ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. 23వ తేదీన జూనియర్, సీనియర్, 24వ తేదీ న సబ్ జూనియర్ పోటీలు ఉంటాయని ఆయన తెలిపారు. మూడు పోటీలలో మొదటి స్థానం సాధించిన టీమ్‌కు రూ.50 వేలు, రెండవ స్థానం సాధించిన టీమ్‌కు రూ.30 వేలు, మూడవ స్థానం సాధించిన జట్టుకు రూ.20 వేల నగదు బహుమతి ఖేలో ఇండియా నుంచి అందజేయడం జరుగుతుందన్నారు.

నేటి ధర్నాను విజయవంతం చేయాలి



కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్
నవతెలంగాణ-నర్సాపూర్

పార్లమెంట్‌లో ఇండియా కూటమి ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టనున్నామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ తెలిపారు. గురువారం ఆయన నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ ధర్నా కార్యక్రమానికి నర్సాపూర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఇండ్లు కోల్పోయిన బాధితుల వివరాల సేకరణ



నవతెలంగాణ-నిజాంపేట

ఎన్.హెచ్.765 రోడ్డు వెడల్పులో భాగంగా మండల పరిధిలోని నందిగామ గ్రామంలో గురువారం అధికారులు ఇండ్లు కోల్పోయిన బాధితుల వివరాలు, పూర్తి సమాచారాన్ని సేకరించారు. ఇంటి స్థలం ఎంత, సర్వే నెంబర్‌లను అడిగి తెలుసుకున్నారు. ఇంటి స్థలం ఎంత, సర్వే నెంబర్‌లు లేనట్లయితే గ్రామపంచాయతీ రికార్డు ప్రకారం ఇంటి స్థలం నంబరు తెలుపాలన్నారు. ఇండ్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందన్నారు. అధికారులు రోడ్డు పక్కన గల ఇండ్లు తొలగించిన వారి కుటుంబాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వారి ఫోన్ నెంబర్ కూడా సేకరిస్తున్నారు.

శ్రీనివాస్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-కొల్చారం

మండలంలోని సంగాయిపేట గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యులు పాశం శ్రీనివాస్ రెడ్డి మాతృమూర్తి పాశం బాలమణి (68) గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో మర ణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి గురువారం సంగాయిపేట గ్రామానికి చేరుకుని మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట ఎంపీపీ మంజుల కాశీనాథ్, వైస్ ఎంపీపీ అల్లు మల్లారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గౌరీ శంకర్, తుక్కాపూర్ సర్పంచ్ మాధవి శ్రీశైలం, వంగలి సంజీవరెడ్డి, ఆత్మకమిటీ డైరెక్టర్ అంజనేయులు, రంగంపేట బీఆర్ఎస్ నాయకులు తలారి దుర్గేష్, నాగరాజ్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఆవుల రాజిరెడ్డి



నవతెలంగాణ-నర్సాపూర్

మండలంలోని పలు బాధిత కుటుంబాలను గురువారం నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి పరామర్శించారు. మండల పరిధిలోని రుస్తుంపేట్ గ్రామంలో ఇటీవల మరణించిన గుర్రాల మొగులయ్య కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి రుస్తుంపేట గ్రామానికి వెళ్లి పరమర్శించారు. అదేవిధంగా కాగజ్ మద్దూర్ గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన కుసంగి సాయమ్మ మృతుదేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాగజ్ మద్దూర్ సర్పంచ్ శివకుమార్, కాంగ్రెస్ నాయకులు గుర్రాల అశోక్ తదితరులు ఉన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని నందగోకుల్ గ్రామ ఉప సర్పంచ్ భాస్కర్ రెడ్డి తమ్ముని వివాహానికి మండల బీఆర్ఎస్ నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ దేశెట్టి సిద్ధ రాములు, ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల మహేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కే వెంకటాపూర్ దయాకర్, సిద్ధ రాములు, దుబ్బ రాజం గౌడ్, రాంపూర్ గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు యాదగిరి పాల్గొన్నారు

గడపగడపకు అయోధ్య రాముని అక్షింతలు



నవతెలంగాణ- వెల్దుర్తి

గడపగడపకు అయోధ్య రాముని అక్షింతలు గురువారం మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజ నిర్వహించి హనుమాన్ భక్తులు మండల వ్యాప్తంగా ప్రతి గడపగడపకు అక్షింతలు చేర వేశారు. భారతదేశవ్యాప్తంగా జరుగుతున్న వితరణ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామానికి ప్రతి గడపగడపకు అక్షింతలు, రాముని చిత్రపటం, కరపత్రం అందజేయడం జరిగిందని వెల్దుర్తి మండల హనుమాన్ యువజన సంఘ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నలుమూలల నుంచి వందలాది హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలను ఆదుకోవడమే తమ లక్ష్యం



నవతెలంగాణ-చేగుంట

పేద కుటుంబాలను ఆదుకొని వారికి తోచిన సహాయంగా నిలుస్తానని సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజులు పేర్కొన్నారు. చేగుంట మండలం చందాయిపేట గ్రామంలో ఆవుబోతు పోచయ్య ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజ్ ఆ కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. ఆ కుటుంబానికి 50 కేజీల బియ్యం, కొంత ఆర్థిక సహాయాన్ని నేరుగా అందజేశారు. గ్రామ ప్రజలకు ఎటువంటి ఆపద వచ్చినా వారిని తప్పకుండా ఆదుకుంటానని సర్పంచ్ స్వర్ణలత తెలిపారు. ప్రజలు తమకిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజా సేవకు అంకితం అవుతానన్నారు. ఓ సామాన్య వ్యక్తిగా ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసుకుంటానన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

క్రిస్మస్ సెలబ్రేషన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే రోహిత్



నవతెలంగాణ-మెదక్ : క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేయనున్నట్లు ఎమ్మెల్యే రోహిత్ రావు పేర్కొన్నారు. గురువారం మెదక్ పట్టణంలోని వైస్రాయ్ గార్డెన్స్‌లో నియోజకవర్గంలోని నిరుపేద క్రైస్తవులకు ప్రభుత్వ ఆదేశానుసారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గిఫ్ట్ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మత గురువుల ప్రత్యేక ప్రార్థనల మధ్య కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించి క్రిస్మస్ శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు, అన్ని మతాల ప్రజల సంక్షేమం కోసం పని చేస్తుందన్నారు. దేవుడి ఆశీస్సులు, దయతో ఎమ్మెల్యేగా ఎన్నుకోబడినట్లు తెలిపారు. ప్రజలందరి కష్ట సుఖాల్లో పాల్పంచుకొని ఒక కుటుంబ సభ్యుడిగా పని చేస్తానని తెలిపారు. మెదక్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి సేవలందిస్తానని తెలియజేశారు. ప్రతీసారి అందరితో కలిసి క్రిస్మస్ వేడుకలను నిర్వహించుకోవాలని కోరుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, కౌన్సిలర్ ఆవారి శేఖర్, లింగం, దొంతి లక్ష్మిముత్యం గౌడ్, నాయకులు సురేందర్ గౌడ్, వెంకటరమణ, జీవన్ రావు, అనిల్ కుమార్, నరేందర్, చందన ప్రశాంత్, జాయ్ ముర్రే, మున్సిపల్ చైర్మెన్ జానకి సాగర్, తహశీల్దార్ శ్రీనివాస్, మైనార్టీ జిల్లా అధికారి జెమ్లు నాయక్, పాస్టరేట్ అసోసియేషన్ సభ్యులు, మతగురువులు, క్రైస్తవులు తదితరులు ఉన్నారు.

వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

జిల్లా కలెక్టర్ రాజర్షి షా
నవతెలంగాణ-మెదక్

పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి, లక్ష్య, కార్యక్రమాలపై జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయాలని ఇందుకుగాను 'లక్ష్య' కార్యక్రమంలో నిర్దేశించిన కార్యక్రమాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని తెలిపారు. చదువులో వెనుకబడ్డ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ఆ విద్యార్థులు చదువు పట్ల ఆసక్తి పెంచుకునేలా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జనవరి నెల నుంచి ఉదయం సాయంత్రం 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. పోషకుల సమావేశంలో విద్యార్థుల ప్రగతి గురించి చర్చించాలన్నారు. విద్యార్థులు పాఠశాలకు ప్రతిరోజు హాజరయ్యే విధంగా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని, ఉన్నతి, తొలిమెట్టు, కార్యక్రమాల అమలుపై మండల విద్యాధికారులు, మండల నోడల్ అధికారులు, సీడీపీ టీమ్ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించి క్షేత్రస్థాయిలో కార్యక్రమం సక్రమంగా అమలయ్యేందుకు పలు సూచనలు చేశారు. ప్రాథమిక స్థాయిలో ఉపాధ్యాయులు వర్క్‌బుక్‌లను సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు. విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని కోరారు. ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మండల నోడల్ అధికారులు



మండల విద్యాధికారులు తమ పరిశీలన అంశాలను తప్పకుండా తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈఓ రాధా కిషన్, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుదర్శన్ మూర్తి, మండల విద్యాధికారులు నీలకంఠం, బుచ్చానాయక్, వివిధ మండలాల నోడల్ అధికారులు, జిల్లా ప్యానల్ సపోర్టింగ్ టీం ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలో గురువారం ఇండిపెండెంట్ చర్చిలో పాస్టర్ యేసు రత్నం ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏసుప్రభును నమ్మిన వారికి అంతా మంచి జరుగుతుందని, క్రిస్మస్ పండుగ సందర్భంగా సెమి క్రిస్మస్ జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఏసుప్రభుని నమ్ముకొని ఆయన చూపిన సన్మార్గంలో నడవాలన్నారు. బాప్తిసం తీసుకొని ఏసుప్రభును నమ్మాలన్నారు. క్రిస్మస్ అంటే శాంతి, ప్రేమ, దయా కరుణ, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పండగ క్రిస్మస్ అన్నారు. ఈ కార్యక్రమంలో యోసేపు, నవీన్, యోబు, చంద్రయ్య, మరియమ్మ, సువర్ణ, రూతమ్మ, బాలరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఐబీసీ సెమీ క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ-నార్సింగి

క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని ఇండిపెండెంట్ బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ రూబెన్స్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మైలారం బాబు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్య పాల్ రెడ్డి, మాజీ టెలికాం బోర్డు సభ్యుడు అంచనూరి రాజేష్, మాజీ వైస్ ఎంపిపి మల్లేష్ గౌడ్, పట్టణ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యదర్శి భూపతి రాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చిలో సెమీ క్రిస్మస్ కేక్‌ను కోసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏసు క్రీస్తు చూపిన మార్గంలో నడవాలని, ప్రేమ భావాలతో ఒకరికి ఒకరు మానవ స్వభావాన్ని తెలియ పరచాలన్నారు. ఏసు చూపిన ప్రేమ ఇతరులతో పంచుకోవాలని, ప్రతి ఒక్కరూ అన్యోన్య సహవాసం కలిగి జీవించడమే ఏసు క్రీస్తు గొప్ప లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి బాప్టిస్ట్ విశ్వాసులు, సంఘ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు .



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన పాలిటెక్నిక్ విద్యార్థులు

నవతెలంగాణ-మెదక్

సృజన టెక్ ఫెస్ట్-2023 జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మెదక్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీమతి డా. కె. సువర్ణలత తెలిపారు. గురువారం మెదక్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సృజన టెక్ ఫెస్ట్- 2023 జిల్లా స్థాయి పోటీలు సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో నిర్వహించారు. ఇందులో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల మెదక్, ఎస్ఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జహీరాబాద్, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల సిద్ధిపేట కళాశాలలు పాల్గొన్నట్లు తెలిపారు. ప్రతీ కళాశాల నుంచి 6 గురు విద్యార్థులు తమ తమ నమూనాలు ప్రదర్శించారన్నారు. ఈ జిల్లా స్థాయి పోటీలలో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల మెదక్ వారి స్మార్ట్ విల్లేజ్ అనే ప్రాజెక్టుకు ప్రథమ బహుమతికి ఎంపికై, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా ఇరిగేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.రాజేందర్ రావు, బీవిఆర్ఐటి అసిస్టెంట్ ప్రొఫెసర్ కె. బాలచందు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ఏ. పుణ్యవతి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మా బ్రతుకులు భారం, ఆదుకోండి



నవతెలంగాణ-నార్సింగి

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల తమ బ్రతుకులు భారమై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితిలో ఉన్నాయని, తమను ఆదుకోవాలని ఆటో యూనియన్ సభ్యులు తహసీల్దార్ షేక్ కరీంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు సభ్యులు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ నెరవేర్చడం కొరకు అమలు పరుస్తున్న ఉచిత బస్సు ప్రయాణం పథకం తమకు శాపంగా మారిందని వాపోయారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల తమ ఆటో లకు గిరాకీ లేదని, కరోనా కాలంలో కలిగిన ఆర్థిక ఇబ్బందుల నుంచి పూర్తిగా కొలుకోక ముందే ఈ పరిస్థుతులు ఏర్పడ్డాయని బాధను వ్యక్తం చేశారు. తమ కుటుంబాలు ఆటోల పైనే ఆధారపడ్డాయని, ఇప్పుడున్న పరిస్థితులలో ఆటోల ఫైనాన్సులు, మరమ్మత్తు చార్జీలు, పిల్లల చదువుల ఫీజులతో పాటు పూట గడవటం కూడా కష్టంగా మారిందన్నారు. తాము గత 20 సంవత్సరాలుగా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నామని, తమ బ్రతుకులు ఏనాడు ఇలా దయనీయంగా మారలేవని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమపై, తమ పిల్లలపై దయ చూపాలని, ప్రభుత్వం తరపున తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్సి నార్సింగి ఆటో యూనియన్ సభ్యులు కుమార్, బోళ్ల సత్యం, వీరేశం, దానియేలు, సంజీవులు, ప్రసాద్, బాలరాజు, శ్రీనివాస్, నరసింహులు, కుంట యాదగిరి, ఆకుల శ్రీనివాస్, తుకారాం, లంబాడీ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు బోధనలతో మానవాళికి మనుగడ

ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి
నవతెలంగాణ-నర్సాపూర్

ఏసుక్రీస్తు బోధనలు ప్రపంచ వానవాళికి మనగడకు ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. క్రిస్టమస్ పండుగను పురస్కరించుకొని గురువారం నర్సాపూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో క్రైస్తవులకు బట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జిల్లా అదనపు కలెక్టర్ రమేష్‌తో కలిసి క్రైస్తవులకు బట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పండుగలకు అన్ని కులాల వారికి బట్టల పంపిణీ చేయడం ప్రారంభిం చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఈ బట్టల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించాలన్నారు. కులమతాల కతీతంగా సాంప్రదాయాల ప్రకారం పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ కమలాద్రి, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్, నాయకులు అశోక్ గౌడ్, సత్యం గౌడ్, శేఖర్, కుమ్మరి నాగేష్, నాగరాజ్ గౌడ్, షేక్ హుస్సేన్, క్రైస్తవ సోదరులు సాగర్, లక్ష్మణ్, కడారి కృష్ణ, సర్పంచులు జితేందర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.



రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి



బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్
నవతెలంగాణ-మెదక్

భారత ఉప రాష్ట్రపతి జగదీప్ దన్కర్‌ను అవహేళన చేసిన కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో బీజేపీ శ్రేణులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఉప రాష్ట్రపతిని రాహుల్ గాంధీ అవహేళన చేయడం చాలా బాధాకరమైన విషయమన్నారు. స్వాతంత్ర భారత దేశంలో ఇలాంటి వ్యాఖ్యలు ఇప్పటి వరకు ఎవరూ చేయలేదని, ఉన్నత పదవిలో ఉన్న రాహుల్ గాంధీ అనితికంగా మాట్లాడటాన్ని బీజేపీ ఖండిస్తున్నట్లు తెలిపారు. రాహుల్ గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలని, ఇలాంటి వైఖరి పునరావృతం కావొద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, మండల అధ్యక్షుడు ప్రభాకర్, బీజేపి నాయకులు సతీష్, ఆకుల రాము తదితరులు పాల్గొన్నారు.

రెచ్చి పోతున్న ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ దొంగలు



నవతెలంగాణ-నార్సింగి

మండలంలో నర్సంపల్లి, వల్లూరు గ్రామాలలో ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ దొంగలు రెండు రోజులుగా రెచ్చిపోతున్నారు. నార్సింగి విద్యుత్ శాఖ ఏ.ఈ సీ.హెచ్ స్వామి తెలిపిన వివరాల ప్రకారం 19వ తేదిన నర్సంపల్లి గ్రామంలోని రెండు 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లలో నుంచి, 20వ తేదీన వల్లూరు గ్రామంలోని 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో నుంచి దొంగలు ఆయిల్‌ను దొంగిలించారు. ట్రాన్స్‌ఫార్మర్‌లను పగుల గొట్టడం, కింద పడేయడం వల్ల కాయిల్‌లు విరిగి భారీ నష్టం వాటిల్లిందని తెలిపారు. ఆయిల్ చౌర్యం విషయమై నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. అలాగే మండల ప్రజలు, రైతులు వ్యవసాయ బోర్ బావుల వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్‌లపై నిఘా పెట్టాలని, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.





పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



నవతెలంగాణ-మర్కుక్

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ మర్కుక్ మండలాధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ అర్హులైన అందరికీ ఆరు గ్యారంటీ పథకాలు అందిస్తా మని తెలిపారు. ఈ నెల 28న కాంగ్రెస్ పార్టీ ఆవి ర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామ సభలు పెట్టి ప్రజలకు అవగాహన కల్పించి దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందన్నారు. కొత్త రేషన్ కార్డులు, గృహలక్ష్మీ ఇందిరమ్మ ఇండ్లు, 500లకే వంట గ్యాస్ సిలిం డర్ వంటి పథకా అర్హులైన వారికి అంద జేస్తామన్నారు. ప్రతి పేదవాడికి పథకాలు అందేలా చర్యలు చేపడతామన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ చెప్పిన విధంగా 100 రోజులలోపు అన్ని పథకాలు అమలు చేస్తామన్నారు.

పల్లవి ప్రశాంత్‌ను వెంటనే విడుదల చేయాలి

కొందరు దుండగులు కావాలని అలజడి సృష్టిస్తున్నారు



నవతెలంగాణ-మర్కుక్

బిగ్‌బాస్ విన్నర్, రైతుబిడ్డ పల్లవి ప్రశాంత్‌ను వెంటనే విడుదల చేయాలని ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యాక్షులు, బీఆర్ఎస్ బీసీ సెల్ మర్కుక్ మండలాధ్యక్షులు మ్యాకల కనకయ్య ముదిరాజ్ అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత రైతు బిడ్డ బిగ్‌బాస్-7 విన్నర్ కావడంతో జీర్ణించుకొని కొందరు దుండగులు కావాలని అలజడి సృష్టించి కేసు నమోదుకు కారణమయ్యారన్నారు. దాడికి గల కాణాలను విచారణ చేసి ప్రశాంత్‌ను విడుదల చేయాలని కోరారు. పేదల కుటుంబం నుండి వచ్చిన ప్రశాంత్‌కు ప్రభుత్వం అండగా నిలవాలన్నారు.

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలి

- మోడల్ స్కూల్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మెనూలో పొందుపరిచిన విధంగా అందించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. గురువారం హుస్నాబాద్ పట్టణంలోని మోడల్ స్కూల్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. హుస్నాబాద్‌లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదనే విషయాన్ని కొన్ని విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మోడల్ స్కూల్ సందర్శించి క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెట్టలేదనే విషయాన్ని కలెక్టర్ గ్రహించి వంట చేసే ఏజెన్సీ వారిని ప్రశ్నించారు. మార్కెట్లో దొరికిన కూరగాయాలను వండు తున్నామని వంటమనిషి భాగ్యలక్ష్మి తెలిపారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని, లేకుంటే ఏజెన్సీని మార్చాలని ప్రిన్సిపాల్ అన్నపూర్ణను ఆదేశించారు. జరుగుతున్న సంఘటనలపై డీఈఓ, ఎంఈవో, ప్రిన్సిపాల్ విచారణ జరపాలని, ఎంఈఓ తరచూ పర్యవేక్షణ చేసి ఇలాంటి పరిస్థితి మళ్లీ పునారావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు హుస్నాబాద్ పట్టణంలో మెడికల్ కళాశాల ఏర్పాటు, ఆర్డీఏ కార్యాలయ భవనాల నిర్మాణాలకు సరిపడే స్థలాన్ని అన్వేషించాలని హుస్నాబాద్ తహసీల్దార్ రవీందర్ రెడ్డిని ఆదేశించారు. హుస్నాబాద్‌లో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంత్రి నివసించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.

నేడు మర్కుక్‌లో కిసాన్ మేళా



నవతెలంగాణ-మర్కుక్

ఈ నెల 22న మర్కుక్ రైతు వేదికలో కిసాన్ మేళా నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి డా.టి.నాగేందర్‌రెడ్డి గురువారం తెలిపారు. సమావేశానికి జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్, మెదక్ జిల్లా, కౌడిపల్లి మండలంలోని తునికి గ్రామంలో గల కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డా.నల్కర్, ఏరువాక శాస్త్రవేత్త డా.పల్లవి, మర్కుక్ మండల ప్రజా ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. మండలంలోని రైతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పల్లవి ప్రశాంత్‌ను అరెస్టు చేయడం సిగ్గుచేటు



నవ తెలంగాణ- గజ్వేల్

బిగ్‌బాస్ విజేత పల్లవి ప్రశాంత్‌ను అరెస్ట్ చేయ డం సిగ్గుచేటని బ్యాగరి వేణు అన్నారు. గురువారం గజ్వేల్‌లో వేణు మాట్లాడుతూ సామాన్య కుటుంబం నుండి ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని బిగ్‌బాస్ విజేత గా గెలుపొందిన పల్లవి ప్రశాంత్‌పై ఓర్వలేక కేసులు పెట్టడం సరైనది కాదన్నారు. సినిమా నటులకు ఇతర సెలబ్రిటీలకు ప్రొటెక్షన్ ఇచ్చే పోలీస్ వ్యవస్థ సామాన్య రైతు బిడ్డకు ఎందుకు ఇవ్వలేకపోయిందని మండిపడ్డారు. వెంటనే పల్లవి ప్రశాంత్‌ను జైల్ నుండి విడుదల చేసి, అతనిపై నమోదు చేసిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

పల్లవి ప్రశాంత్ అక్రమ అరెస్ట్‌ను ఖండిద్దాం



నవతెలంగాణ -గజ్వేల్

సామాన్య రైతు బిడ్డ తలపండిన యాక్టర్లను సైతం వెనక్కి నెట్టి ఆదివారం బిగ్‌బాస్ సీజన్ 7 ఫైనల్స్ విజేతగా నిలిచిన పల్లవి ప్రశాంత్ అక్రమ అరెస్ట్‌ను ఖండించాలని, అతనిపై, ఆయన అనుచరులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, దళిత సంఘాల సినియర్ నాయకులు మాచపూరం బాలనర్సయ్య, కొల్గూర్ దళిత నాయకులు మైసయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏగొండ స్వామి మాట్లాడుతూ గత ఆదివారం నాడు అన్నపూర్ణ స్టూడియో వద్ద జరిగిన గొడవ, విధ్వంసం జరిగిందనే విషయంలో పల్లవి ప్రశాంత్, ప్రశాంత్ సోదరుడు, 3 వినయ్, 4 డ్రైవర్ సాయికిరణ్, 5గా రాజుని నిందితులుగా పరిగణిస్తూ పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. సీజన్ సెవెన్ విన్నర్, బిగ్‌బాస్ రైతుబిడ్డ పల్లవి ప్రశాంత్, అతని అనుచరులను, ఆయన తమ్ముడిని అరెస్ట్ చేశారని గుర్తు చేశారు. టైటిల్ విన్నర్ ప్రకటన తర్వాత పల్లవి ప్రశాంత్ అభిమానులు అమర్ దీప్‌పై, ఇతర కంటెస్టెంట్లపై దాడులకు దిగారని, ఈ క్రమంలో తెలంగాణ ఆర్టీసీ బస్సులపై తమ ప్రతాపాన్ని చూపించారని, ఈ దాడిలో దాదాపు 6 బస్సుల అద్దాలు ధ్వంసం అయ్యాయని తెలిపారు. ఈ కేసుతో పల్లవి ప్రశాంత్‌కు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ప్రశాంత్‌ను విడుదల చేసి అతనిపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

ఉచిత వైద్య శిబిరం అభినందనీయం



నవతెలంగాణ-మర్కుక్

ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజల కోసం మెడిసిటీ హాస్పిటల్ మేడ్చల్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని సర్పంచుల ఫోరం మర్కుక్ మండలాధ్యక్షులు అప్పాల ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని వర్ధరాజ్‌పూర్ గ్రామంలో మెడిసిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మేడ్చల్ హాస్పిటల్ డాక్టర్లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 120 మంది పేషంట్లకు షుగర్ బీపీ ఇతర పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అప్పాల ప్రవీణ్ మాట్లాడుతూ గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం వలన, దూరప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకునే రోగులకు ఇది ఒక సదవకాశమన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దీర్ఘకాలిక రోగాలు ఉన్న వారిని ఆసుపత్రికి తరలించి వైద్యం అందజేస్తామని డాక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు ఎండి అమర్, స్వవిక, శిరీష, మార్కెటింగ్ ఇంచార్జి బాబుగౌడ్, బాలకృష్ణ, శేఖర్ బాబు, చిరాలు, అఖిల తదితరులున్నారు.

గజ్వేల్ ప్రముఖులకు భద్రాచలం దేవస్థానం కల్యాణానికి ఆహ్వానం



నవతెలంగాణ-గజ్వేల్

భద్రాచల దేవస్థానంలో ఈ నెల 23న కన్నులపండువగా జరిగే ముక్కోటి ఏకాదశి ప్రత్యేక ఆహ్వాన పత్రికను గురువారం ప్రముఖులకు శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు అందజేశారు. గజ్వేల్ సిఐ జాన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, కమీషన్ విద్యాధర్‌కి భద్రాచల ఆహ్వానాన్ని అందజేశారు.

ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని మోహినిపుర వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి రోజు ఉత్తర ద్వార దర్శనానికి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ అనువంశిక చైర్మెన్ నగేష్ విష్ణు, ఆలయ ఈవో విశ్వనాథ శర్మ తెలిపారు. గురువారం దేవాలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శన కరపత్రికను ఆవిష్కరించారు. మీడియా సమావేశంలో వన్‌టైన్ సీఐ కృష్ణారెడ్డితో కలిసి వారు మాట్లాడారు. వైకుంఠ ద్వార దర్శనానికి మొత్తం ఐదు క్యూ లైన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. గాంధీ నుంచి వెంకటేశ్వర దేవాలయం రోడ్డులో మూడు క్యూలైన్లు ఏర్పాటు చేయగా అందులో ఒకటి ధర్మ దర్శనం, రెండవది రూ.100ల టికెట్ దర్శనం, మూడవది డోనర్ దర్శనం లైను కేటాయించామన్నారు. అలాగే ఆలయం వెనుక వైపు గల వికాస తరంగిణి రోడ్లో ఒకటి విఐపి లైన్, మరొకటి స్థానిక వార్డు ప్రజలకు దర్శనం చేసుకోవడానికి అవకాశం కల్పించామన్నారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మంచినీటి వసతి, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ చర్చి కాంపౌండ్, హై స్కూల్ గ్రౌండ్, గర్ల్స్ హైస్కూళ్లను భక్తుల వాహనాల పార్కింగులకు ఏర్పాటు చేశామన్నారు. ఇబ్బందులు లేకుండా భక్తులందరూ స్వామివారి దర్శనం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

బడి బయటి పిల్లలపై సర్వే



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండలం ఆకునూరు కాంప్లెక్స్ పరిధిలోని తాడూరు గ్రామంలో గురువారం బడి బయట పిల్లలపై సర్వే నిర్వహించారు. ఎంఈఓ మొగుళ్ల నర్సింహారెడ్డి మాట్లాడుతూ 6 నుండి 14 సంవత్సరాల బడి బయట పిల్లలుంటే పాఠశాలలో చేర్పాలని కోరారు. విద్యా హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తూ బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని తెలిపారు. సర్వేలో ఆకునూరు కాంప్లెక్స్ సీఆర్పీ జె. కనకరాజు పాల్గొన్నారు.

పందికొక్కుల్లా దోచుకున్న ప్రజాప్రతినిధులు

- కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రజలు అధికారమిస్తే గ్రామాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లాల్సిన ప్రజాప్రతినిధులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ, విలువైన ప్రభుత్వ భూములను పందికొక్కుల్లా కబ్జా చేశారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ సిద్దిపేట పట్టణం జిల్లా కేంద్రంగా ఏర్పడడంతో పక్కనే ఉన్న మిట్టపల్లి గ్రామంలోని భూములకు మంచి డిమాండ్ వచ్చిందన్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన ప్రజాప్రతినిధులే దొంగలుగా మారి ప్రభుత్వ భూమిని యథేచ్ఛగా కబ్జా చేసి రికార్డులకు ఎక్కించుకున్నారని మండిపడ్డారు. మిట్టపల్లి గ్రామ సర్పంచ్ లక్ష్మి కుమారుడు వంగ ప్రవీణ్ రెడ్డి భారీ అక్రమాలకు, అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. లక్ష్మి సంతకాన్ని ఫోర్జరీ చేశారని ఆరోపించారు. గ్రామంలోని సర్వే నంబర్లు 315/1నుండి 315/9, 333, 321/డి, 312/1లలో వంగ ప్రవీణ్‌రెడ్డి, మారెడ్డి రవీందర్‌రెడ్డి, వారి అనుచరుల పేరుతో రికార్డులలో నమోదు చేసుకున్నారని అన్నారు. మిట్టపల్లి భూకబ్జాలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స ప్రమేయం ఉన్నట్లు తెసిందన్నారు. జిల్లా కలెక్టర్ విచారణ చేసి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట యువజన పట్టణ అధ్యక్షులు గయాజుద్దీన్, ఎన్ ఎస్ యు ఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రశద్, నాజ్జా, ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి



నవతెలంగాణ-నంగునూరు

దేశ ప్రజలకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని బీజేపీ మండల అధ్యక్షులు బెదురు కుమారస్వామి డిమాండ్ చేశారు. గురువారం నంగునూరు మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీలో పార్లమెంట్ ఆవరణలో భారత ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్‌కడ్‌ను ఉద్దేశిస్తూ టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ మిమిక్రీ చేస్తూ వారి హావభావాలు ప్రదర్శిస్తూ ఉంటే ఆ సన్నివేశాన్ని ఉత్తేజ పరుస్తూ వీడియో రికార్డింగ్ చేస్తూ తాత్కాలిక ఆనందాన్ని పొందిన కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ చేసిన చర్యను, వారి తీరును నంగునూరు మండల శాఖ తీవ్రంగా ఖండించింది. రాజ్యాంగం పదవిలో వున్న ఉపరాష్ట్రపతిని కించపరిస్తే దేశ ప్రజలను అవమానించినట్లేనని, రాహుల్ గాంధీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వల్లపురెడ్డి రజినీకర్ రెడ్డి, సిహెచ్. వెంకటరెడ్డి, చిక్కుడు శ్రీనివాస్, కోల సతీష్, అంబదాస్ పాల్గొన్నారు.

శాసనసభ స్పీకర్‌ను కలిసిన గజ్వేల్ నేతలు



నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మాతా శిశు సంక్షేమ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను గజ్వేల్ కాంగ్రెస్ నాయకులు గజ్వేల్ మహేష్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాజీ మంత్రి జానారెడ్డి, ఆయన కుమారుడు ఎమ్మెల్యే జైవీర్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని చెప్పారు. ప్రభుత్వ పథకాలు పేదలకు అందేలా చూడాలని మంత్రులు సూచించారు.

పద్మ పీఠం బహుకరణ



నవతెలంగాణ-సిద్దిపేట

సావర్కర్ సేవా సమితి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ సిద్ది వినాయకుని నవరాత్రి ఉత్సవాలలో భాగంగా భక్తులు హుండీలో వేసిన డబ్బులతో వెంకటేశ్వర స్వామి వారికి పద్మ పీఠంను బహుకరించినట్లు సంఘం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

బస్సుల్లో కిక్కిరిసిన జనం





నవతెలంగాణ-తొగుట

మహిళలకు ఉచిత ప్రయాణం ప్రభుత్వం ప్రకటించడంతో పల్లెవెలుగు బస్సుల్లో కిక్కిరిసిన జనం ప్రయాణిస్తున్నారు. గురువారం సికింద్రాబాద్, గజ్వేల్, దుబ్బాక వరకు ప్రతి గంటకు ఒక బస్సు వెళ్తుంటాయి. ఇదే క్రమంలో ఈ మధ్య కాలంలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో భాగంగా ఆరు గ్యారంటీలు మెనిఫేస్టోలో పెట్టిన విషయం తెలిసిందే. ఆరు గ్యారంటీలలో భాగంగా డిసెంబర్ 9వ తేదీన కాంగ్రెస్ పార్టీ అది నాయకురాలు సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసింది. ప్రారంభించిన నాటి నుంచి నుంచి రోజురోజుకు ప్రయాణికుల రద్దీ పెరిగిపో తుంది. ప్రయాణికులు బస్సులో పెరిగిపోతుండడంతో బస్సులలో సీట్ల నిండా, నిల్చొని ఉండగా వెంకట్రావు పేట స్టేజి వద్ద బస్సు ఎక్కడానికి సిద్ధంగా ఉన్నవారు చాలా మంది ఉన్నారు. ఇదిలాఉండగా ఉచిత బస్సు ప్రయాణం బాగుందని కొందరు, దీనివల్ల సంస్థ నష్టపోతుందని మరి కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇలా చేస్తే రాష్ట్రం మరిన్ని అప్పుల్లో కూరుకుపోతుందని ప్రజలు వాపో తున్నారు. పెరిగిపోతున్న ప్రయాణికుల కోసం ప్రభుత్వం మరిన్ని బస్సులు ఏర్పాటు చేస్తుందా! ఉచిత ప్రయాణం కొనసాగుతుందా అనే దానిపై చర్చ కొనసాగుతుంది.

చాణక్య నీతిశాస్త్రంపై గరికపాటి ప్రవచనాలు



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట ధార్మిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24, 25న చాణక్య నీతి శాస్త్రంపై పద్మశ్రీ గరికపాటి ప్రవచనాలు సిద్దిపేట డిగ్రీ కలశాల మైదానంలో ఉంటాయని సంస్థ బాధ్యులు పరమేశ్వర్, రమేష్, మధుసూదన్ తెలిపారు. గురువారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజాంలో యువత పెడదారి పట్టడం చూస్తున్నామన్నారు. జీవితం సుఖ శాంతులతో సాగిపోయేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. గరికపాటి ప్రవచనాలు ఈ మూడు రోజుల పాటు సాయంత్రం 5 గంటల నుండి 8 గంటల వరకు ఉంటాయన్నారు. ఆధ్యాత్మిక చింతన కోసం, మనసు ప్రశాంతత కోసం చిన్న పిల్లలనుండి పెద్దవాళ్ళ వరకు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహాలక్ష్మి పథకంలో సవరణలు చేయాలి

- డీఎస్పీ అధ్వర్యంలో తహసిల్దార్ కు వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-బెజ్జంకి

రోజువారి కూలీ చేసుకునే నిరుపేద మహిళలకు, నెలవారిగా వేతనాలందుకునే ప్రభుత్వ ఉద్యో గులకు మహాలక్ష్మి పథకంలో ప్రభుత్వం సమప్రాదన్యత ఇవ్వడం సరైందికాదని..ఆర్టీసీ నష్టాలబాటలో వెళ్లకుండా మహాలక్ష్మి పథకం అమలులో అన్ని వర్గాల వారికి న్యాయం జరిగేలా సవరణలు చేయాలని డీఎస్పీ మండలాధ్యక్షుడు లింగాల సురేశ్ మహారాజ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం తహసీల్ యందు తహసిల్దార్ శ్యామ్‌కు మహాలక్ష్మి పథకంలో సవరణలు చేసి అన్ని వర్గాల వారికి ప్రభు త్వం మేలు చేసేల హేతుబద్ధీకరించాలని డీఎస్పీ పక్షాన వినతిపత్రమందజేసినట్లు సురేశ్ మహారాజ్ తెలిపారు.